కొలువుదీరిన పీర్లు

అమరాపురం: మండల కేంద్రంలో శనివారం పీర్లు కొలువు దీరాయి. రెండు చోట్ల చావిడిలో ప్రత్యేకంగా చక్కెర చదివింపులు చేశారు. ఈ సందర్భంగా పీర్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు పీర్ల చావిడి వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మొహరం పండుగను హిందువులు, ముస్లింలు సోదర భావంతో జరుపుకోవడం ఆనావాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు చక్కెర, పప్పులు ప్రసాదంగా అందజేశారు.

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటామని గ్రామస్తులు తెలిపారు. శనివారం పీర్ల చావిడిలో పీర్లను కొలువుదీర్చారు. ఈనెల 16వ తేదీన అగ్నిగుండం మహోత్సవం, 17వ తేదిన జలధి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏడాది పీర్ల (బాబయ్య) ఉత్సవాలను మతాలకు అతీకంగా హిందూ, ముస్లింలు కలిసి కట్టుగా జరుపుకోవడం ప్రత్యేకత. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు తెచ్చిన పూలతో పీర్లను అలంకరించి చెక్కర, బొరుగులతో చదివింపులు చేయించి ప్రసాదంగా భక్తులకు అందిస్తున్నామని ముజావర్లు తెలిపారు.


రొళ్ల మండలం రత్నగిరిలో కొలువుదీరిన పీర్లు


అమరాపురంలో
పాత మసీదు వద్ద కొలువుదీరిన పీర్లు

కౌన్సిల్ ఆమోదం.. టెండర్లు లేకుండా పనులు!

- రూ.44 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి నేడు ఎమ్మెల్యే భూమిపూజ

హిందూపురం: హిందూపురం మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధుల మెప్పు కోసం అధికారులు కొత్త పద్ధతులకు శ్రీకారం చుట్టారు. ముందస్తుగా కౌన్సిల్ ఆమోదాలు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేయకుండానే నేరుగా పనులకు భూమి పూజ చేపట్టనున్నారు. రాజు తలుచుకుంటే.. అన్న చందంగా పరిగి బస్టాండ్ వద్ద ఆఘమేఘాలపై సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణతో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూమి పూజలకు శ్రీకారం చుట్టారు. అధికారులు ఎవరి మెప్పుకోసం ఇలా చేస్తున్నారో తెలియడం లేదు కానీ సుమారు రూ.44 లక్షల వెచ్చించి సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేయనున్నారు. ప్రస్తుతం భూమిపూజ చేస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి ఇంతవరకూ కౌన్సిల్ ఆమోదం తీసుకోలేదు. అలాగే ఎలాంటి టెండర్లు పిలవలేదు. నేరుగా పనులకు శ్రీకారం చుడుతూ ఆ పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించి భూమి పూజ చేయించడానికి అంత ఆసక్తి ఎందుకో తెలియడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.2.50 కోట్లు పనులు కేటాయించి టెండర్లు పూర్తి చేసి పనులు అప్పగించి ఏడాది కావస్తున్నా ఆయా పనులు ఇంతవరకూ పూర్తిచేయలేదు. ఏడాది క్రితం డీఎల్ రోడ్డులో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసినా పనులు పూర్తి కాలేదు. పనులు మొదలుపెడతామని అక్కడి వ్యాపారులను తీవ్ర ఇబ్బందులు పెట్టి షాపుల ఎదురుగా మెట్లు తదితరాలన్నీ తొలగించి హంగామా చేసి తిప్పలకు గురిచేశారు. అంత హడావుడి చేసిన అధికారులు తర్వాత ఆ కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకపోయినా కిమ్మనలేదు. అయినా మున్సిపల్ అధికారులు ఆయా కాంట్రాక్టర్లకు పనులు కేటాయిస్తూనే ఉన్నారు. పనులు పూర్తి చేయలేని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాల్సి ఉన్నా.. మున్సిపల్ అధికారులు వాటిని వదిలేసి కొత్త పనులు ఇచ్చుకుంటూ వెళ్తున్నారంటే మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. కాగా ఈ విషయంగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆయన సమాధానం చెప్పకుండానే ఫోన్ కట్ చేసి స్విచ్ ఆఫ్ చేయడం గమనార్హం.

క్లుప్తంగా

వ్యాయమం దినచర్యగా మలచుకోవాలి


శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రతిఒక్కరూ వ్యాయామాన్ని దినచర్యగా మలుచుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సంతేబిదనూర్ ఆయుర్వేద వైద్యురాలు అనూరాధ సూచించారు. స్థానిక వివేకానంద సెంటర్‌లో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులకు అజీర్ణం, మలబద్ధకం, శ్వాసకోశ వ్యాధులు, కీళ్లనొప్పులు , నిద్రలేమి షుగర్, బీపీ వంటి సమస్యలుంటాయని, వైద్యుల సలహా మేరకు మందులు తీసుకుంటూ రోజూ వ్యాయమం చేయడం ద్వారా వాటిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. అలాగే మహిళల ఆరోగ్య సమస్యలు, వ్యాయమాల గురించి వివరించారు. అనంతరం ఆయుష్ మిషన్ ద్వారా అందిన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా గురువులు బద్రీనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: మండలంలోని మలుగూరులో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. శనివారం గురుకుల పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించి, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో దాదాపుగా 640 మంది విద్యార్థులు చదువుతున్నారని, విద్యార్థులకు మెనూ మేరకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాలలో గ్రంథాలయం, మెస్ హాల్, వసతి గృహం శిథిలావ్యవస్థకు చేరుకున్నాయని, వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, హుస్సేన్, ఆఫ్రిద్, సురేష్, విక్రమ్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ షేక్ బాజిజాన్ సైదా

అమరాపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం పెనుగొండ డీఎస్పీ షేక్ బాజిజాన్ సైదా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులపై ఆరా తీశారు. మండలంలో పరిస్థితులను ఎస్ఐ జనార్దన నాయుడును అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఓ మైనర్ బాలికపై జరిగిన అత్యాచార యత్నం కేసుపై ఆరా తీశారు. మండలం కర్ణాటక బార్డర్‌లో ఉన్నందున అక్రమ మద్యం పేకాట తదితర అసాంఘిక కార్యాకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్దన నాయుడు పోలీసులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు నిత్యావసరాల పంపిణీ


మాట్లాడుతున్న ఆర్డీటీ సిబ్బంది

రొళ్ల: స్థానిక ఆర్డీటీ కార్యాలయ ఆవరణలో శనివారం రొళ్ల, అగళి మండలాలకు చెందిన 70 మంది ఆసరా లేని ఒంటరి మహిళలకు నిత్యవసరాలు పంపిణీ చేసినట్లు ఏటీఎల్ ఓబులేష్ తెలిపారు. ఒక్కో మహిళకు 30 కిలోల బియ్యం, 4 కిలోల బ్యాళ్లు, 2 కిలోల చొప్పున బెల్లం, గోధుమ, రాగి పిండితో పాటు ఒక పాకిట్ పామాయిల్, సబ్బు ఇతరాత్ర సరుకులు అందించామని పేర్కొన్నారు. అనంతరం ఆయన మహిళలతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి ప్రతి రెండు నెలలకు ఒకసారి నిత్యావసర సరులు పంపిణీ చేస్తామన్నారు. ఆర్డీటీ అందించే సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎల్ బాలయ్య, సీఓలు హనుమంత రాయుడు, శివప్రసాద్, ఓబులేష్, నాగమణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఒత్తిడి దూరం

- సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: క్రీడలతోనే మానసిక, శారీరక ఒత్తిడి దూరమవుతుందని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ జిల్లా స్థాయి క్రీడా వేడుకలను ప్రారంభించారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు రామాంజనేయులు జ్ఞాపకార్థం టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. క్రికెట్ పోటీలను ప్రారంభించిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. యూటీఎఫ్ నాయకులను అభినందించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి జయ చంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ ఈ పోటీలు ఈనెల 13 నుంచి ఆగస్ట్ చివరి వారం వరకు కొనసాగుతాయన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ టాస్ వేసి, పోటీలను ప్రారంభించారు. యూటీఎఫ్ నాయకులు నరేష్, భూతన్న, హరికృష్ణ, నారాయణస్వామి, మహలింగప్ప, నబీ, మారుతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన

రొద్దం: మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామ సమీపంలో అగ్రిగోల్డ్ భూముల్లో చెట్ల తొలగింపుపై 'అగ్రిగోల్డ్ భూముల్లో చెట్ల నరికివేత' శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ రాజగోపాల్ రెడ్డి అగ్రిగోల్డ్ భూములను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐడీ అటాచ్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో సంస్థ పెంచిన నీలగిరి చెట్లను తొలగించడంపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఇక్కడ దాదాపు వంద ఎకరాలు ఉందన్నారు. అగ్రిగోల్డ్ భూములు ప్రజలకు సంబంధించి ఆస్తి అని చెప్పారు. అగ్రిగోల్డ్ భూముల్లో ఎవ్వరూ చెట్లను తొలగించడానికి, విక్రయించడానికి అధికారం లేదన్నారు. చెట్లను తొలగించిన కొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..


అగ్రిగోల్డ్ భూముల్లో చెట్లు నరికేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఘన నివాళి


సంతాప సభలో పాల్గొన్న సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని వైబీహళ్లి గ్రామంలో వైవీ సంధ్యారాణి వైకుంఠ సమారాధన (పెద్దకర్మ) జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వైసీ గోవర్ధన్ రెడ్డి, జిల్లా బీసీ సెల్ కమిటీ సభ్యుడు శ్రీరాములు, పట్టణ కమిటీ సభ్యుడు వెంకటరంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సంధ్యారాణి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంధ్యారాణి పేద ప్రజలకు అందించిన సహాయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, నాయకులు పాల్గొన్నారు.

అక్కచెల్లెళ్లకు ప్రశంసలు



విద్యార్థిని గౌసియా అందుకున్న ప్రశంసా పత్రం

పెనుకొండ: పట్టణానికి చెందిన అక్క చెల్లెళ్లు సీఏలో ప్రతిభ చాటారు. ఎగువగడ్డలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీక్ పెద్ద కుమార్తె సల్మా బెంగళూరులో సీఏ చేస్తోంది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను చాటింది. చెల్లెలు గౌసియా హైదరాబాద్‌లో సీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జాతీయ స్థాయిలో జరిగిన స్పీచ్‌లో 1,400 మంది ప్రతిభా వంతులు పాల్గొన్నారు. అందులో జాతీయ స్థాయిలో 12 మందిని ప్రతిభావంతులుగా గుర్తించగా, అందులో గౌసియా ఒకరు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం


ప్రిన్సిపాల్ గోపాల్ దంపతులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గోపాల్‌ను శనివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న గోపాల్ ఉద్యోగ విరమణ చేశారు. వక్తలు మాట్లాడుతూ పాఠశాల, విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రిన్సిపాల్ చేసిన సేవలు మరులేనివన్నారు. కార్యక్రమంలో నూతన ప్రిన్సిపాల్ సుభారాణి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

సోమందేపల్లి: మండలంలోని పెద్దబాబయ్యపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ శ్రీకాంత్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కురుబ శివయ్య శనివారం రాత్రి హత్యాయత్నం చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. నాలుగేళ్ల క్రితం తమ ఇంటి వద్ద స్థల వివాదంలో తన తల్లిదండ్రులు వెంకటేష్, జయమ్మపై అప్పట్లో శివయ్య దాడికి పాల్పడ్డాడు. దీంతో అప్పట్లో సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అతనిపై కేసు నమోదయ్యింది. దీంతో పాత కక్షలు మనసులో పెట్టుకొని ఇంటి వద్ద తనపై రాడ్డుతో తలపై దాడి చేసినట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిందని మీ అంతు చూస్తానని బెదిరించారని బాధితుడు తెలిపాడు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.


గాయపడిన శ్రీకాంత్

త్వరగా కోలుకోవాలి


రాజమ్మను పరామర్శిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్

మడకశిరరూరల్: మండల పరిధిలోని వైబీహళ్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భరత్‌రెడ్డి తల్లి రాజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటోంది. శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్ తదితరులు భరత్‌రెడ్డి తల్లిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తల్లిని బాగా చూసుకోవాలని భరత్‌రెడ్డికి సూచించారు. రాజమ్మ కోలుకోవాలని ఆకాంక్షించారు.

ట్రిపుల్ ఐటీకి రైతు బిడ్డ ఎంపిక


విద్యార్థి హరికుమార్

రొద్దం: మండలంలోని బీదానిపల్లి గ్రామానికి చెందిన రైతు కల్లకుంట రామాంజనేయులు కుమారుడు హరికుమార్ ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని, తద్వారా బాగా చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినట్లు విద్యార్థి చెప్పాడు. మడకశిర ఎంజేపీ పాఠశాలలో పదోతరగతి చదివినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా చెట్టు


టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఉన్న ఎండిపోయిన చెట్టు

మడకశిరరూరల్: పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఎండిపోయిన ఓ చెట్టు ప్రమాదకరంగా మారింది. కల్యాణ మండపంలో శుభ కార్యక్రమాలు జరుగుతాయి. ఆ సమయంలో ఎవరైనా అటువైపు వెళ్తే కొమ్మలు మీద పడే ఆవకాశం ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఎండిన చెట్టును తొలగించి ప్రమాదం జరుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ సత్యనారాయణ తదితరులు

పరిగి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని కొడిగెనహళ్లిలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొన్నారు. భగత్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో బాలాజీ నగర్‌లోని భక్త మార్కండేయ ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్ఐ పాల్గొని, మొక్కలు నాటారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లుగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశులు, పర్యావరణ పరిరక్షణ వేత్త భాస్కర్‌రెడ్డి, భగత్ సింగ్ సేవాసమితి, భక్త మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కమిటీ ఎన్నిక

హిందూపురం: హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్‌క్లబ్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహా అధ్యక్షుడిగా సురేష్‌రెడ్డి, ముఖ్య సలహాదారుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యనిర్వహణ అధ్యక్షుడిగా ఎస్.షబ్బీర్, అధ్యక్షుడి సి.రామాంజనేయులు ఎన్నికయ్యారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా కే.ప్రశాంత్ కుమార్,ఉపాధ్యక్షులుగా రమేష్, రమేష్, అల్లిపీరా, సహాయ కార్యదర్శులుగా రాజేష్, చరణ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అంజినప్ప, జాబిఉల్లా, కోశాధికారిగా ఫణిభూషణ్, ఈసీ మెంబర్స్‌గా జగదీష్, సింహం, దాసప్ప, విశ్వనాథ్, నారాయణ, శ్రీధర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డిని ఎన్నుకున్నారు.

డిగ్రీలో ప్రవేశానికి గడువు పొడిగింపు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 20 వరకు గడువు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేశవ రావు శనివారం తెలిపారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాల హెల్ప్ డెస్క్ సిబ్బందిని సంప్రదించాలన్నారు. బీఎస్సీ ఆనర్స్, మ్యాథ్స్, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బీకాం ఆనర్స్, కంప్యూటర్స్, అక్కౌంట్స్, బీఏ ఆనర్స్, హిస్టరీ కోర్సుల్లో చేరవచ్చన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

చిలమత్తూరు: పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఏపీ గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కార్మికులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేష్, స్వచ్ఛ భారత్ కార్మికులు, యూనియన్ నాయకులు ఆదినారాయణ, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి పాడి ఆవు మృతి

పరిగి: గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడలు కానీ, ఫెన్సింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పెద్దిరెడ్డిపల్లిలో శనివారం సాయంత్రం ఇదే కారణంతో ఓ పాడి ఆవు మృత్యువు పాలైన ఘటన గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీరామప్ప తన ఆవును మేత కోసమని ఉదయం తీసుకెళ్లాడు. ఇంటికి వస్తున్న సమయంలో గ్రామంలోని రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డిని మేస్తుండగా, ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన వైర్లు తగలడంతో పాడి ఆవు అక్కడికక్కడే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. తనకున్న జీవనాధారం పాడి ఆవు అని, విద్యుత్ షాక్‌తో దాదాపు రూ.50 వేల విలువైన ఆవును కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు.


చనిపోయిన ఆవును చూసి కన్నీరుమున్నీరవుతున్న బాధితుడు శ్రీరామప్ప

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాదేవి అమ్మవారికి శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పర్యాటకులు, భక్తులు అమ్మవారికి అభిషేకార్చనలు, తీర్థప్రసాదాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికి అన్నదాన సత్రంలో అన్నదానం చేశారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి


నంది విగ్రహం వద్ద పర్యాటకులు


కొలనును తిలకిస్తున్న పర్యాటకులు

లేపాక్షి: లేపాక్షి దేవాలయం వద్ద శనివారం పర్యాటకుల సందడి చోటు చేసుకుంది. ఆలయంలో శిల్పాలు, చిత్రలేఖనాలతో పాటు వివిధ చారిత్రత్మక కట్టడాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను గైడ్‌ల ద్వారా తెలుసుకున్నారు. అదేవిధంగా జటాయువు పక్షి, థీం పార్కు, నంది విగ్రహం, వివిధ పార్కుల్లో పర్యాటకులు కిక్కిరిశారు. అనంతరం దేవాలయంలో దుర్గాదేవి, వీరభద్రస్వామి విగ్రహాలను దర్శించుకున్నారు.

త్వరలో పావగడకు సాగునీరు

పావగడ: భద్రమేల్దండె సాగు నీటిని త్వరలోనే పావగడకు అందించి చెరువులు నింపుతామని కేంద్ర రైల్వే, జలశక్తి శాఖా మంత్రి వి.సోమణ్ణ తెలిపారు. శనివారం ఆయన రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ పనుల పరిశీలనకు పావగడకు విచ్చేశారు. రొప్పం పరిధిలో నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, కూటమి మిత్రుడు మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప సహకారంతో రైల్వేలైన్ పనులు 2026 డిసెంబర్ నెలలో ముగిస్తామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రధాని మోదీని ప్రత్యేక ప్యాకేజీ, బీహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రత్యేక హోదా అడుగుతున్నారని అయితే కర్ణాటక బీజేపి మంత్రులు మోదీ ఎదుట ఎందుకు చేతులు కట్టుకుని కూర్చున్నారని ఓ విలేకరి ప్రశ్నించారు. ఎన్డీఏ కూటమి మిత్రులు అడిగినా తప్పేమి లేదని మంత్రి సమాధానం ఇచ్చారు. భద్రమేల్దండె సాగు నీటిని పావగడకు త్వరలోనే అందించి చెరువులు నింపుతామన్నారు. అంతకు ముందు రాజవంతి సరిహద్దులో మంత్రి సోమణ్ణకు కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, ఆర్సీ అంజినప్ప, ఈరణ్ణ, మంజునాథ చౌదరి తదితర జేడీఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అతిథి గృహంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, అతని తండ్రి మాజీ మంత్రి వెంకటరమణప్ప తదితరులు మంత్రికి పూల మాలలు వేసి సన్మానించారు. స్థానిక జేడీఎస్ నాయకుడు సాగడు వెంకటేశ్ తాలూకా సమస్యలపై వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపి నేత శివప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, శంకరరెడ్డి, బత్తినేని నాని, రాజేశ్, రవి తదితర కాంగ్రెస్ నాయకులు, బీజేపి, జేడీఎస్ నేతలు పాల్గొన్నారు.


రైల్వే పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి సోమణ్ణ

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం


వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధులు

పావగడ: స్థానిక సాయి ద్వారకామయి వృద్ధాశ్రమంలో ఎన్‌సీడీ (నాన్ కమ్యునికబల్ డీసీజస్) విభాగం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 48 మంది వృద్ధులకు బీపీ, మధుమేహం, ఫిజియోథెరపీ, క్యాన్సర్, కంటి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా ఔషధాలు అందజేశారు. ఈ శిబిరంలో ఎన్‌సీడీ సిబ్బంది ఎండీ ఖాసీం, ఎస్.చంద్రకళ, గొల్లాలప్ప, సంతోష్, కోమలేశ్, పవిత్ర, హనుమంతరాయ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726